వార్త

# వేంపెంట గురించి ఇంకొంచెం

వేంపెంటలో ఏం జరిగిందో ఎందుకు జరిగిందో సమగ్రంగా తెలుసుకోవాలంటే వరవరరావుగారు తన జూలై 31 నాటి వ్యాసంలో చెప్పని విషయాలు కూడా తెలుసుకోవాలి. ఆ దాడిని మాల-మాదిగ ఘర్షణగానూ రెండు విప్లవ పార్టీల మధ్య ఘర్షణగాను పత్రికలూ ప్రభుత్వమూ చిత్రిస్తున్నాయన్నారు. అది వట్టి చిత్రణేనా? అది చిత్రణకాదంటే పీపుల్స్ వార్, ప్రతిఘటన పార్టీల బాధ్యతను ఒప్పుకోవలసి వస్తుంది కాబట్టి చిత్రణగానే చూడాలా?

ఆ గ్రామంలో కొంతకాలంగా మాల-మాదిగ వైరుధ్యం ఉంది. (అంటే అందరు మాలలకూ అందరు మాదిగలకూ శత్రుత్వం ఉందని అర్థం కాదు. ఆ 'గుర్తింపు' ప్రాతిపదిక మీద వైరుధ్యం ఉందని మాత్రమే). ఆ వైరుధ్యం 'మాదిగ దండోరా - మాల మహానాడు వైరుధ్యాల నేపథ్యంలో' (వరవరరావుగారి మాటలు) జరుగుతున్న చిత్రీకరణ కాదు. కారణమేదయినా అది ఆ ఊరి వైరుధ్యమే. అది పుట్టే నాటికి మాల మహానాడు ఉనికిలో లేదు. మాదిగ రిజర్వేషన్ ఉద్యమం అప్పటికి పుట్టిందో లేదోగానీ ఆ ఊరి వైరుధ్యాలకు మూలం ఆ ఉద్యమం కాదు. మొన్నటి దాడి మాల-మాదిగ ఘర్షణ కాదని చెప్పవలసిన బాధ్యత రాష్ట్ర మాల నాయకత్వంపైన ఉందని వరవరరావు అంటున్నారు. ఆ ఊరి గొడవలతో ఏమీ సంబంధం లేని వారిపైన ఆ బాధ్యత ఎందుకుంటుందో అర్థం కాదు. నిజానికి వివరణ ఇయ్యవలసిన బాధ్యత ఎవరిమీదనైనా ఉంటే అది పీపుల్స్ వార్, ప్రతిఘటన పార్టీలపైననే.

జూలై 15-16 నాటి రాత్రి జరిగిన దాడిలో బుద్ధా వెంగళరెడ్డి అనుచరులయిన మాలలు 'ఎవరో కొందరు' పాల్గొని ఉండవచ్చునన్నారు. నిజానికి ఏ కులం వారు ఎంత సంఖ్యలో పాల్గొన్నారో ఇప్పటిదాకా ఎవరికీ తెలియదుగానీ దాడి చేసిన వారిలో అధిక సంఖ్యాకులు ఆ గ్రామ మాల కులస్తులేనని రేపు తేలినా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. వాళ్లు ఈ రోజు బుద్ధా వెంగళరెడ్డి అనుచరులనేది సత్యమో అసత్యమోగానీ (ఇక మీదట మాత్రం తప్పనిసరిగా అవుతారు) ఒకప్పుడు పీపుల్స్ వార్ అనుచరులనేది పూర్తి సత్యం. ఆ తర్వాత సిపిఐ (ఎం-ఎల్) 'ప్రతిఘటన' అనుచరులనేదీ సత్యం.

అవును వేంపెంట, వరవరరావుగారు అన్నట్టు ఎప్పటి నుండో కమ్యూనిస్టు గ్రామమే. ఆ గ్రామంలో ఏదో ఒక దశలో కమ్యూనిస్టులు కాని వారు ఎవ్వరూ లేరు. పీపుల్స్ వార్ చేతిలో శిక్షకు గురయిన భూస్వామి చంద్రశేఖరరెడ్డి కూడా (నాకు తెలిసి) ఒకప్పుడు కమ్యూనిస్టే. అందరు ఏదో ఒకనాడు కమ్యూనిస్టులయిన ఆ గ్రామంలో ప్రజలే ఇంత ఘోరంగా చీలి ఒకరిపైన ఒకరు ప్రాణంతకంగా దాడి చేసుకునే స్థితి ఎందుకు వచ్చిందనే ప్రశ్నకు బుద్ధా వెంగళరెడ్డి కంటే (అతను తన స్వార్థ ప్రయోజనాల కోసం ఆ స్థితిని వాడుకున్నాడు కావచ్చు) వివిధ కమ్యూనిస్టు పార్టీలే జవాబు చెప్పాలేమో.

కమ్యూనిస్టు ఉద్యమం ఫలితంగా రెడ్డినైనా పెత్తందార్లనయినా ప్రశ్నించి తలెత్తుకు తిరిగే ఆత్మవిశ్వాసం వేంపెంట ప్రజలలో పెరిగిన మాట కూడా వాస్తవమే. కానీ ఆపైన ఏం జరిగిందనేదే ప్రశ్న. ఒక దశలో గ్రామంలోని పేదలలో - ముఖ్యంగా మాల కులస్తులలో - పీపుల్స్ వార్‌కు ఎదురులేని బలం ఉండింది. ధాన్యం కాటాకు సంబంధించిన వివాదంతో మాల మాదిగల మధ్య ఘర్షణ మొదలయింది. ఈ వివాదంలో పీపుల్స్ వార్ వ్యక్తపరచిన అభిప్రాయం న్యాయమైనదేగానీ పీడిత ప్రజల మధ్య అంకురించిన ఈ వైరుధ్యం తీవ్ర రూపం తీసుకోకుండా చూడవలసిన బాధ్యత ఆ పార్టీపైననే ఉండింది. ప్రతీ చిన్న తగాదా ముఠా కక్షల రూపం తీసుకునే ప్రమాదం ఉన్న రాయలసీమలో ఈ జాగ్రత్త మరీ అవసరం (ఏ ఫాక్షనిస్టో దానిని వాడుకున్నాడని ఆ తరువాత వాడిని తిట్టి ప్రయోజనం లేదు). ఈ విషయంలో పీపుల్స్ వార్ విఫలం కావడం ఈనాటి పరిస్థితికి మూలం (ఏం జరిగింది, ఎందుకు జరిగింది అని వివరించడానికి పూనుకున్న వరవరరావుగారు ఈ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకపోవడం విచిత్రం). ఆ దశలోనే వేంపెంటకు చెందిన దేవరాజు అనే మాల కులస్తుడి హత్య జరిగింది. అతనిని పీపుల్స్ వారే చంపిందని ఆనాటి నుండి ఈనాటి దాకా ఆ ఊరికి చెందిన మాలకులస్తులలో ఎక్కువ మందేకాక బయటి వాళ్లు కూడా చాలామంది నమ్ముతున్నారు. ఇది మాల-మాదిగ వైరుధ్యాన్నీ పెంచింది, పీపుల్స్ వార్ పట్ల మాల కులస్తులలో వ్యతిరేకతను పెంచింది. పీపుల్స్ వార్ మాత్రం దేవరాజును చంపింది తాము కాదనీ ఏవో వ్యక్తిగత కారణాల వల్ల ఆ గ్రామంలోని మాల కులస్తులలోనే కొందరు అతనిని చంపారనీ అంది. అనడమేకాక, ఒక మాల కులస్తుడిని కిడ్నాప్ చేసి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టించి ఆ విషయం అతనితోనే చెప్పించింది కూడా. అప్పటికే పీపుల్స్ వార్‌పైన కోపంగా ఉన్న మాల యువకులకు ఈ చర్య మరింత కోపం తెప్పించింది.

వేంపెంటకు చెందిన దేవరాజు అనే మాల కులస్తుడి హత్య జరిగింది. అతనిని పీపుల్స్ వారే చంపిందని ఆనాటి నుండి ఈనాటి దాకా ఆ ఊరికి చెందిన మాలకులస్తులలో ఎక్కువ మందేకాక బయటి వాళ్లు కూడా చాలామంది నమ్ముతున్నారు. ఇది మాల-మాదిగ వైరుధ్యాన్నీ పెంచింది, పీపుల్స్ వార్ పట్ల మాల కులస్తులలో వ్యతిరేకతను పెంచింది. పీపుల్స్ వార్ మాత్రం దేవరాజును చంపింది తాము కాదనీ ఏవో వ్యక్తిగత కారణాల వల్ల ఆ గ్రామంలోని మాల కులస్తులలోనే కొందరు అతనిని చంపారని అంది. అనడమేకాక, ఒక మాల కులస్తుడిని కిడ్నాప్ చేసి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టించి ఆ విషయం అతనితోనే చెప్పించింది కూడా. అప్పటికే పీపుల్స్ వార్‌పైన కోపంగా ఉన్న మాల యువకులకు ఈ చర్య మరింత కోపం తెప్పించింది.

ఈ స్థితిలో సిపిఐ (ఎం.ఎల్) (ప్రతిఘటన) ఆ గ్రామంలోకి ప్రవేశించింది. 'స్వర్ణపుల్లయ్య ఆ పేరుతో చెలామణి అయ్యాడ'ని వరవరరావుగారు అనడం వాస్తవం కాదు. పీపుల్స్ వార్‌కు వ్యతిరేకమైన వారిని 'ప్రతిఘటన' వాళ్లే చేరదీసి ఆ గ్రామంలో తమ ఉద్యమ నిర్మాణం చేపట్టారు. 'ప్రతిఘటన పార్టీ భూమి పోరాటాలు చేపట్టకపోవడం వల్ల' ఆ పార్టీ నిజాయితీని ప్రశ్నించే అవకాశం ఏర్పడిందంటూ వరవరరావుగారు సంబంధం లేని కారణం చూపించి ఆ పార్టీని విమర్శించనక్కరలేదు. ప్రత్యక్షంగానే విమర్శించవచ్చు. విమర్శించాలి. ఒక ఎం-ఎల్ పార్టీ పని చేస్తున్న చోట మరొక ఎం-ఎల్ పార్టీ ప్రవేశించదలచుకున్నప్పుడు మొదటి పార్టీ కార్యకలాపాల వల్ల అసంతృప్తులయిన వారిని రెండవ పార్టీ చేరదీసే అవకాశవాదం కొత్తది కాదు. కరీంనగర్‌లో, వరంగల్‌లో, మెదక్‌లో, ఖమ్మంలో, నల్గొండలో, శ్రీకాకుళంలో దీనికి చాలా ఉదాహరణలున్నాయి. అన్ని ఎం-ఎల్ పార్టీలూ ఈ పని చేశాయి, చేస్తున్నాయి. మోతాదులో తేడాలుండవచ్చు. వేంపెంటలో ప్రతిఘటన ఇదే పని చేసింది. అది ఇంతటి ఘోరానికి దారితీసిన తరువాత మాకేమీ సంబంధం లేదని చేతులు దులిపేసుకుంటే చేసిన తప్పు చెరిగిపోదు. వినాశకరమైన ఈ అవకాశవాద రాజకీయాలను గుర్తించడానికీ విమర్శించడానికీ విప్లవ మేధావులకూ ప్రజాతంత్రవాదులకూ మనసొప్పక పత్రికలను ప్రభుత్వాన్నీ ఆడిపోసుకోవడం ఎందుకు? బిల్ క్లింటన్ నుండి బుద్ధా వెంగళరెడ్డి దాకా ఎవరినీ వదిలిపెట్టకుండ నిశితంగా విమర్శించేవారికి ఎం-ఎల్ పార్టీల దగ్గరికొచ్చేసరికి మొహమాటాలెందుకు అడ్డమొస్తాయి?

'ప్రతిఘటన' రూపంలో ఒక ఎం-ఎల్ పార్టీ అండ తమకు దొరకకపోతే వేంపెంటలోని పీపుల్స్ వార్ వ్యతిరేకులు అంతటి ఘోరానికి పాల్పడేవారా? ప్రతిఘటన అండ దొరకగానే వాళ్లు (భూస్వాములు కాదు, ఎక్కువగా మాల కులస్తులే) పీపుల్స్ వార్ పద్ధతిలోనే తాము కూడా ఆ పార్టీ అనుయాయుడయిన ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి, కొట్టి, దేవరాజును పీపుల్స్ వార్ హత్య చేసిందని చెప్పించారు. ఆ ఘటన నుండయినా జరగగల పరిణామాలను పీపుల్స్ వార్ ఊహించి ఉండవలసింది. ఊహించకుండానే శివయ్యను హత్య చేశారా? ఊహించి కూడా చేశారు? రాయలసీమ ముఠా నాయకులెవ్వరూ ఇప్పటిదాకా నక్సలైట్లతో పెద్ద ఎత్తున తలపడే సాహసం చేయలేదు. ఇప్పుడు ఒక నక్సలైట్ పార్టీకి వ్యతిరేకంగా మరొక నక్సలైట్ పార్టీని చేరదీస్తే కాగల కార్యం వారే చూసుకుంటారని వేంపెంట నుండి వారంతా గ్రహించి ఉంటారు. ఈ మాట అనవలసిందిపోయి బీహార్ ప్రైవేటు సైన్యాల పోలిక తీసుకురావడం ఎందుకు?

తెలంగాణ భూస్వాముల అనుభవం చూసి రాయలసీమ భూస్వాములు ఏదో నేర్చుకుంటున్నారని వరవరరావుగారు అంటున్నారు. భూస్వాములేమి నేర్చుకుంటారోగానీ తెలంగాణ రాయలసీమల మధ్యనున్న తేడాల నుండి నక్సలైట్ ఉద్యమకారులు నేర్చుకోవలసింది ఉంది. తెలంగాణాలో ఒక ముఖ్యుడిని చంపితే గ్రామాన్ని కంట్రోల్‌లో పెట్టుకోవచ్చు. రాయలసీమలో అది సాధ్యం కాదు. హత్యకు ప్రతీకారంగా ఫ్యాక్షన్ పుడుతుంది. అప్పుడే కాకపోతే ఎప్పుడో ఒకప్పుడు ప్రతి హత్యలు జరుగుతాయి. హత్య చేసిన వర్గానికి చెందిన అత్యంత బలహీనులు - వేంపెంట మాదిగల వంటి వారు - దెబ్బతింటారు. ఇది తెలియకనే పీపుల్స్ వార్ శివయ్యను చంపి ఉంటే అది క్షమించరాని చర్య. తెలిసీ చంపి ఉంటే అంతకంటే క్షమించరాని చర్య. దేవాదాయ భూముల విషయంలో పీపుల్స్ వార్, జనశక్తి పార్టీలు చేపడుతున్న పోరాటం చాలా న్యాయమైనదే. అయితే అది భూస్వాములకూ పేదలకూ మధ్య పోరాటం కాదు. అంతో ఇంతో భూమి ఉన్న రైతులకూ, ఏమీ లేని వారికీ మధ్యనున్న వైరుధ్యం. చాలా సందర్భాలలో ఇందులో బిసిలు - దళితులు అన్న వైరుధ్యం కూడా ఇమిడి ఉంటుంది. అవతలివైపు ఒక ఫాక్షనిస్టు నిలబడ్డాడని చెప్పి ఈ అంశాల ప్రాధాన్యతను మరచిపోయి దానిని ఫాక్షనిస్టులకూ ప్రజలకూ మధ్య వైరుధ్యంగానే చూడడం చాలా నష్టానికీ హింసకూ దారితీయగలదు.

ఈ రోజు మనం వేంపెంట గురించి చేసే విశ్లేషణ నిన్నటి చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడినా పడకపోయినా, రేపు జరగగల ఘోరాల గురించి అప్రమత్తంగా ఉండడానికయినా ఉపయోగపడాలి. కర్నూలుకు పొరుగున ఉన్న అనంతపురంలో వేంపెంటలు చాలా జరగగలవు. ఆ విషయాన్ని గుర్తించడానికి ఉపయోగపడని విశ్లేషణలు ఎందుకు పనికొస్తాయి? నేడు బుద్ధా వెంగళరెడ్డి మీద దుమ్మెత్తిపోసి చేతులు దులుపుకుంటున్నట్టు, ఆ రోజు పరిటాల రవి మీదనో పయ్యావుల కేశవ్ మీదనో నెపం పెట్టి కరపత్రాలూ కవితలూ రాసుకోవడానికి తప్ప?

-కె. బాలగోపాల్